## క్లుప్తంగా

### విద్యార్థులకు క్విజ్ పోటీలు


క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గరివిడి శాఖా గ్రంథాలయంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు లైబ్రేరియన్ ఎం.ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. కొండపాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వి.బంగార్రాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు,యువత గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలన్నారు.క్విజ్ పోటీల్లో విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ చెప్పారు.

### శ్రీరంగరాజపురంలో వైద్యశిబిరం

గజపతినగరం: మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో సోమవారం104 వైద్యశిబిరం నిర్వహించారు. 51మందికి వైద్యాధికారి వివిధ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. బహిరంగ మల మూత్ర విసర్జన వల్ల కలిగే అనర్థాలను వివరించి, వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించాలని సూచించారు.

### అదనపు బాధ్యతలు అప్పగించొద్దు


ఎంపీడీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

వేపాడ: సచివాలయాల్లో పనిచేస్తున్న తమకు అదనపు బాధ్యతలు అప్పగించొద్దని మండలంలోని సచివాలయ ఏఎన్ఎంలు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో జియోట్యాగింగ్ సర్వే, పెన్షన్ల పంపిణీ, మరుగుదొడ్ల సర్వే వంటి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించలేకపోతున్నామని, ఆ బాధ్యతల నుంచి తప్పించాలని అభ్యర్థించారు. ఎంపీడీఓ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.

### పులకించిన 'పుణ్యగిరి'


పుణ్యగిరి ప్రధాన ఆలయం వద్ద భక్తుల రద్దీ

శృంగవరపుకోట: కార్తీక మాసం మూడో సోమవారం వేళ పుణ్యగిరి పర్వత సానువులు శివనామస్మరణతో హోరెత్తాయి. ఉమాపతిని దర్శించుకునేందుకు జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి వేలసంఖ్యలో వచ్చిన భక్తులతో పుణ్యగిరి పులకించింది. మహిళలు మెట్లకు పసుపు,కుంకుమ పెడుతూ కొండ ఎక్కారు. పుణ్యగిరి క్షేత్రంలోని ధారగంగమ్మ లోయ, పుట్టుధారల వద్ద పవిత్ర స్నానాలు చేసి ఉమాకోటి లింగేశ్వరున్ని దర్శించుకున్నారు.పలువురు తలనీలాలు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దూర ప్రాంతాలైన ఒడిశా, శ్రీకాకుళం, ఉభయగోదావరి జిల్లాలు, విశాఖ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు సమీపంలోని తోటల్లో వంటా, వార్పులు చేసుకుని వన భోజనాలు చేసి సందడిగా గడిపారు. దేవదాయశాఖ భక్తులకు పులిహోర, లడ్డూ ప్రసాదాలను విక్రయించగా, మహాలక్ష్మి చంద్ర భారతిబాబా ఆశ్రమ నిర్వాహకులు భక్తులకు టిఫిన్స్, కాఫీ,టీ, మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేసి, చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు అందించారు.

### 104 ఉద్యోగుల వినతి

గుర్ల: తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ మండలంలోని పకీరుకిత్తలి ఎంపీటీసీ సభ్యుడు బూర్లె జోగినాయుడుకు మండల 104 ఉద్యోగులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఉద్యోగులు కె.గోవింద్, నాగరాజు మాట్లాడుతూ 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ నంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని,104ను ప్రభుత్వమే నిర్వహించాలని, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీటీసీని కోరారు.

### వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

శృంగవరపుకోట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ డి.శ్రీధర్ నేతృత్వంలో పాఠశాలల విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం, ప్రహేళిక, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శ్రీదేవి, మల్లేశ్వరరావు, పీఈటీ ఎన్.విజయశాంతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

# సమస్యలకే వసతి

అవి పేరుకే వసతి గృహాలు.. వాస్తవానికి కనీస వసతులు, సౌకర్యాలు లేని నిలయాలు. అక్కడ ఉండే విద్యార్థులకు అన్నీ సమస్యలే. హాస్టళ్లలో ఎలాంటి నియమ, నిబంధనలు ఉండవు. ఎప్పుడు ఎవరైనా రావొచ్చు, వెళ్లొచ్చు. ఎవరొచ్చినా, వెళ్లినా అక్కడ ఎలాంటి ఆధారాలు ఉండవు. చీపురుపల్లి,గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పలు వసతి గృహాల్లో సీసీ కెమెరాలు లేవు సరికదా కనీసం లాగ్‌బుక్ రిజిస్టర్ కూడా నిర్వహించడం లేదు. ఆడపిల్లలు ఉండే వసతిగృహాల్లో సైతం ఇలానే నడుస్తుంటే వారి భద్రత కోసం ఎవరికి చెప్పుకోవాలనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత గాలిలో దీపంలా మారుతోంది. ప్రధానంగా బాలికల వసతిగృహాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. కొన్ని వసతి గృహాల్లో కనీస సదుపాయాలు కూడా లేకపోవడంతో విద్యార్థులు అల్లాడుతున్నారు. వసతి గృహాల్లో విద్యార్థుల భద్రత, వారికి కల్పించాల్సిన సౌకర్యాలపై హైకోర్టు ఇటీవల సూచనలు చేసింది. కానీ క్షేత్ర స్థాయిలో వసతిగృహాల్లో సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు మెరుగుపడలేదు.


చీపురుపల్లి: గుర్ల మండలంలోని కలవచర్ల వసతిగృహంలో పాడైన మరుగుదొడ్ల తలుపులు

- వసతి గృహాల్లో విద్యార్థులను వేధిస్తున్న సమస్యలు
- కానరాని సీసీ కెమెరాలు, సోలార్ ఫెన్సింగ్‌లు
- గాలిలో దీపంలా విద్యార్థుల భద్రత
- లాగ్‌బుక్ రిజిస్టర్లు నిర్వహించని వైనం
- విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు లేని 'మరుగుదొడ్లు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

చీపురుపల్లి: నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లిలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలల బాలికల వసతిగృహంతో పాటు బాలుర వసతిగృహం ఉంది. ఈ రెండు వసతిగృహాల్లో దాదాపు 300 మంది వరకు విద్యార్థులు ఉంటారు. అలాగే పాఠశాల బాలికల వసతిగృహం కూడా ఉంది కళాశాల బాలికల వసతిగృహానికి ప్రహరీ ఉన్నప్పటికీ సోలార్ ఫెన్సింగ్ లేదు. వసతిగృహం ఆవరణతో పాటు కారిడార్‌లో ఎలాంటి సీసీ కెమేరాలు లేవు. వసతిగృహానికి ఎవరొచ్చి వెళుతున్నారో తెలిసేందుకు లాగ్ బుక్ రిజిస్టర్ కూడా నిర్వహించడం లేదు. గుర్ల మండలంలోని కలవచర్ల బీసీ సంక్షేమ బాలుర వసతిగృహంలో మరుగుదొడ్లు పూర్తిగా పాడయ్యాయి. ఇక్కడ ప్రహరీ ఉన్నప్పటికీ గేటు లేదు. సోలార్ పెన్సింగ్, సీసీ కెమెరాలు లేవు. పరుపులు లేకపోవడంతో ఐరన్ మంచాలపైనే విద్యార్థులు నిద్రించాల్సి వస్తోంది. మెరకముడిదాం మండలంలోని గర్భాంసాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో కిటికీలకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు చల్లగాలి తట్టుకోలేక దుప్పట్లు అడ్డుగా కట్టారు. ఇక్కడ మరుగుదొడ్ల తలుపులు పూర్తిగా పాడయ్యాయి.


చీపురుపల్లి: సీసీ కెమెరాలు, సోలార్ ఫెన్సింగ్ లేని చీపురుపల్లి కళాశాలల బాలికల వసతిగృహం

### నేలపై భోజనం.. ఆరుబయట స్నానం


దత్తిరాజేరు: గంట్యాడ బాలుర వసతి గృహంలో ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థులు


దత్తిరాజేరు: కె.కొత్తవలస బాలుర వసతి గృహంలో ఊడిపోయిన కిటీకీల మెస్‌లు

దత్తిరాజేరు: గజపతినగరం నియోజవర్గంలోని వసతి గృహాల పరిస్థితి ఒక్కోచోట..ఒక్కో తీరుగా ఉంది.40 మంది విద్యార్థులుంటున్న దత్తిరాజేరు బీసీ బాలుర వసతి గృహంలో సరిపడా స్నానాల గదులు లేవు. దుప్పట్లు పంపిణీ చేయలేదని, చలికాలం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. కె.కొత్తవలసలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర వసతి గృహంలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 500 మంది విద్యార్థులున్నారు. డైనింగ్ టేబుళ్లు లేక పోవడంతో నేలపై కూర్చొని భోజనాలు చేస్తున్నారు. తరగతి గదులు కూడా సరిపడా లేవు. సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. వసతిగృహంలోని గదుల కిటీకీలకు మెస్‌లు అమర్చకపోవడంతో దోమల బెడద ఉంది. గజపతినగరం మండలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లు ఎనిమిది ఉన్నాయి. మండల కేంద్రంలోని కళాశాల బాలికల వసతి గృహాన్ని శిథిలమైన అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. వర్షం కురిస్తే చాలా చోట్ల నీరు కారుతుందని విద్యార్థినులు చెపుతున్నారు. లోగిశలోని బాలుర సమీకృత వసతి గృహంలో డార్మెటరీల తలుపులు పాడైపోయాయి. మెంటాడ జంక్షన్‌లోని బీసీ బాలురు కళాశాల వసతి గృహం అద్దెభవనంలో నిర్వహిస్తున్నా రు. ఇరుకు గదులు, అరకొరవసతులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గంట్యాడ మండల కేంద్రంలోని బాలుర సంక్షేమ వసతి గృహంలో రెండు స్నానపు గదులే ఉండడంతో సరిపడక విద్యార్థులు ఆరు బయట స్నానాలు చేస్తున్నారు. బీసీ బాలురు వసతి గృహంలో మరుగుదొడ్లకు డోర్‌లు లేవు. బొండపల్లి మండలంలోని దేవుపల్లి బాలికల వసతి గృహంలో 28 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఆరు మరుగుదొడ్లు ఉన్నప్పటికీ రన్నింగ్ వాటర్‌సదుపాయం లేదు. పాడైన మోటార్‌కు మరమ్మతులు చేపట్టలేదు. విద్యార్థినులు హ్యాండ్ బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. బొండపల్లిలోని బీసీ బాలిక వసతి గృహం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది.


దత్తిరాజేరు: గజపతినగరంలో శిథిల అద్దె భవనంలో నడుస్తున్న కళాశాల బాలికల వసతి


దత్తిరాజేరు: బొండపల్లి మండలంలోని దేవుపల్లిలో రన్నింగ్ వాటర్ సదుపాయం లేని బాలికల హాస్టల్ మరుగుదొడ్లు

### దశాబ్దాలుగా అద్దె కొంపల్లోనే..

శృంగవరపుకోట: మండలంలో ఎనిమిది వసతి గృహాలున్నాయి. వీటిలో పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలుర, బాలికల వసతి గృహాలు, బీసీ కళాశాల బాలుర, బాలికల వసతి గృహాలు దశాబ్దాల కాలం గా అద్దె కొంపల్లో అరకొర వసతుల మధ్య నడుస్తున్నాయి. ఈ భవనాలకు నెలకు రూ.1,50,000 మేర అద్దెలు చెల్లిస్తున్నారు. 340 మంది విద్యార్థులుంటున్న ఈ వసతి గృహాల్లో బెడ్లు నిల్, దోమలు ఫుల్ అన్న చందంగా ఉంది పరిస్థితి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా మరుగుదొడ్లు లేవు.ప్రధానంగా బాలికల వసతి గృహాలకు ప్రహరీలు, సరైన రక్షణ, నిఘా వ్యవస్థ లేదు. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ఎస్టీ కళాశాల బాలికల, బాలుర వసతి గృహాలు కుక్, కమాటీల పోస్టులు లేకుండానే నడుస్తున్నాయి. వార్డెన్లు స్థానికంగా ఉన్న వారిని ఏర్పాటు చేసుకుని తమ చేతి నుంచి చెల్లింపులు ఇస్తున్నారు. ఫ్యాన్లు, విద్యుత్, ప్లంబింగ్, శానిటేషన్ ఇలా ప్రతీ అవసరానికి నెలజీతంలో రూ.15వేల వరకూ తామే భరించాల్సి వస్తోందంటూ వార్డెన్లు వాపోతున్నారు. ఇక పట్టణంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఊసు చెప్పక్కరలేదు. కూలడానికి సిద్ధంగా ఉన్న భవనంలో వసతి గృహం నిర్వహిస్తున్నారు. గచ్చులూడి, శ్లాబ్ పెచ్చులు రాలి అధ్వాన్న స్థితిలో ఉంది. బెడ్లు, తగినన్ని మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎస్.కోట, ధర్మవరం గ్రామాల్లోని బీసీ బాలుర వసతి గృహాలకు వార్డెన్లు లేరు. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్తవలసలో సాంఘిక సంక్షేమ బాలురు,బాలికల హాస్టళ్లతో పాటు డాక్టర్ బి.ఆర్,అంబేడ్కర్ బాలికల ఆశ్రమ పాఠశాల ఉన్నాయి. ఎక్కడా సోలార్ ఫెన్సింగ్‌లు లేవు. 48 మంది విద్యార్థులుంటున్న సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో కిటీకీలకు మెస్‌లు లేవు. 56 మంది విద్యార్థుల గల బాలుర హాస్టల్‌లో మంచాలు లేవు. ఈ హాస్టల్‌లో గేటు రిజిస్టర్ నిర్వహించడం లేదు.లక్కవరపుకోటలోని ఏకైక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 55 మంది విద్యార్థులు ఉంటున్నారు. విద్యార్థులకు దుప్పట్లు అందించ లేదు. శీతాకాలం కావడంతో చలికి ఇబ్బంది పడుతున్నారు.విద్యార్థులకు ట్రంకు పెట్టులు అందించకపోవడంతో దుస్తులు, పుస్తకాలు భద్రపరుచుకునేందుకు అవస్థలు పడుతున్నారు.


శృంగవరపుకోట: ఎస్.కోటలో అరకొర వసతులతో అద్దె భవనంలో నడుస్తున్న ఎస్సీ బాలుర వసతి గృహం


శృంగవరపుకోట: ఎస్.కోట గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూలకు చేరిన మంచాలు


శృంగవరపుకోట: ఎస్.కోట గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులే భోజనం వడ్డిస్తున్న దృశ్యం


శృంగవరపుకోట: సోలార్ పెన్సింగ్‌లేని కొత్తవలస బి.ఆర్.అంబేడ్కర్ బాలికల హాస్టల్ ప్రహరీ

## ధైర్యంగా పోటీ చేద్దాం

గజపతినగరం: ప్రతిపక్షంలో ఉన్నామని అధైర్యం చెందాల్సిన పనిలేదని, త్వరలో నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ధైర్యంగా పోటీ చేయాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పార్టీశ్రేణులకు సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బొండపల్లి మండల నాయకులు, ప్రజాప్రతినిధులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహం, విధానాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు సమయం దగ్గరపడుతోందని, నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలని, ఎవరూ ప్రలోబాలకు లోనుకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంపీ పీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు చేసిన సంక్షేమం, మంచి ని, వివరించి, వారిని ధైర్యంగా ఓటు అడగాలని సూచించారు. పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల విజయానికి నాయకులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు.బొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు రాపాక సూర్యప్రకాష్, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిన్నంనాయుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఈదుబిల్లి కృష్ణ తదితరు లు పాల్గొన్నారు.


బొండపల్లి మండల నాయకులతో సమావేశమైన అప్పలనరసయ్య

## వైభవంగా అయ్యప్ప పడిపూజ


పడిపూజకు హాజరైన భక్తులు

కొత్తవలస: మండలంలోని చీపురువలస సమీపంలోని వైజయంతీ పాఠశాల ఆవరణలో గురుస్వామి బొనుగు ప్రసాద్ 18వ పడి సందర్భంగా ఆదివారం రాత్రి అయ్యప్ప పడి పూజ వైభవంగా నిర్వ హించారు. శబరిమల తరహాలో సుమారు 50 అడుగుల ఎత్తున అయ్యప్పస్వామి ఆలయ సెట్ వేశారు. విశాఖ జిల్లా పెందుర్తి అయ్యప్పస్వామి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశాఖ,విజయనగరం,అనకాపల్లి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారణ భక్తులు హాజరయ్యారు.

## ఐక్యంగా ఓబీసీ సాధించుకుందాం

చీపురుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా కళింగ కోమట్లు అంతా ఐక్యంగా ఉండి ఓబీసీ రిజర్వేషన్ సాధించుకునేందుకు రావాలని కళింగ కోమటి సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు కోరారు. చీపురుపల్లి కళింగ కోమటి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం స్థానిక వైశ్యవర్తక సంఘ భవనంలో సోమవారం నిర్వహించారు. నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ఆయన మాట్లా డుతూ గతంలోనే కళింగ కోమట్లను బీసీలో చేర్చారని, ప్రస్తుతం ఓబీసీ రిజర్వేషన్ ఫైలు ఢిల్లీలో ఉందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. నూతన కార్యవర్గ సభ్యులు కష్టపడి పని చేసి సంఘానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సంఘంలో పేదల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు తంగుడు రామకృష్ణ, స్థానిక సంఘ పెద్దలు డాక్టర్ టి.నీలకంఠేశ్వరరావు, పొట్నూరు ప్రభాకరరావు, అందవరపు హరి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


కళింగ కోమటి సంఘం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరాజులు

**నూతన కార్యవర్గం ఇదే....**

చీపురుపల్లి కళింగ కోమటి సంఘం నూతన అధ్యక్షుడిగా పొట్నూరు నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా పొట్నూరు త్రినాథరావు, సుంకరి చంద్రశేఖర్ గుప్త, కార్యదర్శిగా అందవరపు నగేష్, సంయుక్త కార్యదర్శిగా కొత్తకోట సురేష్, కోశాధికారిగా కందుల పుండరి, సంయుక్త కోశాధికారిగా సుంకరి సతీష్‌తో పాటు కార్యవర్గంలో మిగతా పదవులకు మరికొంత మందిని సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. వీరికి సంఘ పెద్దలు అభినందనలు తెలిపారు.

## మంచి పశువైద్యులుగా రాణించాలి


ఫ్రెషర్స్‌డే వేడుకల్లో మాట్లాడుతున్న రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అదనపు సంచాలకుడు


వేడుకల్లో అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): పశువైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పశువైద్యంలో తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, మంచి పశువైద్యాధికారులుగా ఎదగాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అదనపు సంచాలకుడు డా.వై.సింహాచలం అన్నారు. ఈ మేరకు గరివిడిలో గల శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల విద్యార్థి దశలోనే విద్యార్థులు పశువైద్యంలో మంచి నైపుణ్యం సంపాదించాలని సూచించారు. మూగ జీవులు, పశుపోషకులకు మంచి సేవలందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, ట్రెజరీశాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పప్పు జోగారావు, డిప్యూటీ సివిల్ సర్జన్ డా.జి.అర్చన పాల్గొన్నారు.

## అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

శృంగవరపుకోట/గజపతినగరం/కొత్తవలస: ఇళ్ల స్థలాలు లేని పేదలకు గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి పభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు.ఎస్.కోటలోని చింతబడి సచివాలయం, గజపతినగరం మండల కేంద్రంలోని సచివాలయం–1, పురిటిపెంట సచివాలయం–2, కొత్తవలస తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఖండిపల్లి భీముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి అయిదు నెలలు గడిచినా ఇంకా ఎవరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు చేయాలని కోరుతూ సచివాలయ సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. కొత్తవలసలో సీపీఐ ఎస్.కోట నియోజకవర్గ కార్యదర్శి డేగల అప్పలరాజు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్తవలస ప్రాంతానికి చెందిన సుమారు వెయ్యి మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, స్థలం చూపించలేదని, వారికి ఇప్పుడైనా స్థలాలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ బి.నీలకంఠరావుకు వినతిపత్రం అందజేశారు.


గజపతినగరం సచివాలయం-1 సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

## శివోహం


వేపాడ: బొద్దాం ఉమా బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కార్తీకమాసం మూడో సోమవారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. స్వామివారి దర్శనానికి వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. అర్చకులు భక్తులతో శివలింగాలకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు ధ్వజంస్తంభాల వద్ద, ఆలయ ఆవరణలో దీపారాధన చేశారు. పలుచోట్ల ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.గుర్ల మండల కేంద్రంలో శివ స్వాములు నగర సంకీర్తన చేశారు.మెరకముడిదాం మండలంలోని గోపన్నవలసలో బ్రహ్మకుమారీస్ చీపురుపల్లి సేవాకేంద్రం ఇంచార్జ్ బి.కె.శాంతి అక్కయ్య ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేసి సాయంత్రం దీపారాధన చేశారు. – సాక్షి నెట్‌వర్క్


గజపతినగరం: గజపతినగరం శివాలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు


చీపురుపల్లి: చీపురుపల్లిలో పూజలందుకుంటున్న ఉమానీలకంఠేశ్వరస్వామి


చీపురుపల్లి: చీపురుపల్లిలోని ఉమానీలకంఠేశ్వస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


బొండపల్లి: గెద్దవేటలోఅన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


కొత్తవలస: సుంకరపాలెం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మెరకముడిదాం: గోపన్నవలసలో బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలు


గుర్ల: గుర్ల శివాలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు


గుర్ల: గుర్లలో శివ స్వాముల నగర సంకీర్తన